

'భవిత' విద్యార్థుల ప్రొఫైల్ సిద్ధం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో చదువుకుంటున్న ప్రతి దివ్యాంగ విద్యార్థి ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లాలోని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు మంజూరు చేసే యూడీఐడీ కార్డులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలరు. ప్రత్యేక విద్యనభ్యసించే కేంద్రాలను ఉపాధ్యాయులు సందర్శించాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులు తమ పనులు తాము చేసుకునే విధంగా మెళకువలు నేర్పించాలని సూచించారు. భవిత కేంద్రాలకు కావలసిన ప్రత్యేక వస్తువులు, ఆట పరికరాలు, సౌకర్యాలను కల్పిస్తామని అన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపించాలని సూచించారు. మేనరిక వివాహాల అనర్థాలు, గర్భిణిగా ఉన్నపుడు టీఫా స్కాన్ వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈవో జనార్దన్‌రావు, భవిత కో ఆర్డినేటర్ ఆంజనేయులు, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



రేపటి నుంచి ఒంటి పూట బడి

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- 'పది' పరీక్షా కేంద్రాల్లో 1 నుంచి సాయంత్రం 5 వరకు

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులను నిర్వహిం చాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 15 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం మాత్రమే తరగతులు నిర్వహించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 నుంచి మధ్యా హ్నం 12.00 గంటల వరకు మాత్రమే తరగతులను నిర్వహించాలని సూచించింది. మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు భోజనం అందించాలని సూచించింది. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో పరీక్ష నిర్వహించిన తర్వాత మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులను నిర్వహించాలని పేర్కొంది. ఈ విద్యాసంవత్సరం చివరి రోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 12న పాఠశాలలను పునః ప్రారంభిస్తారు.

12.30కు మధ్యాహ్న భోజనం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, తరగతుల నిర్వహణ అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని సూచించింది. దీనితో ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో ఒంటి పూట బడుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలని సూచించారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించినందున ఆ సమయంలో ఎండల తీవ్రత మరింత అధికంగా ఉంటుంది. ఆ సమయంలో పాఠశాలకు వెళ్లడం, ఇంటికి పిల్లలను తీసుకురావడం ఇబ్బందిగా ఉంటుందని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

21 నుంచి పదో తరగతి పరీక్షలు

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు డిసెంబరు నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, గాలి, వెలుతురు, మంచినీటి వసతి, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు ఉండేలా ఏర్పాట్లు చేశారు.

ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పరీక్షా కేంద్రాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. పరీక్షా సమయానికి ఐదు నిమిషాల ఆలస్యంగా వచ్చిన వారిని పరీక్ష రాసేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాకు 31 మంది జూనియర్ లెక్చరర్లు

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్‌కమిషన్ (టీజీపీఎస్‌సీ) నిర్వహించిన యామక పరీక్షల్లో ఎంపికైన 31 మంది జూనియర్ లెక్చరర్లను జిల్లాకు కేటాయించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వారికి పోస్టింగ్ ఇవ్వడంతో గురువారం కొందరు విధుల్లో చేరారు. మరికొంత మంది ఒకటిరెండు రోజుల్లో చేరుతారని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు తెలిపారు. కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేయగా, టీజీపీఎస్‌సీ నియామకాలతో వారి స్థానంలో జేఎల్స్ జాయిన్ అవుతున్నారు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో ఒకరు డీబార్

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షల్లో ఒకరు కాపీయింగ్ చేస్తుండగా పట్టుకొని డీబార్ చేశారు. గురువారం మ్యాథమెటిక్స్ పేపర్-1, జువాలజీ-1, హిస్టరీ-1 పరీక్షలు నిర్వహించారు. నగరంలోని ట్రినిటీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒకరు కాపీయింగ్ చేస్తుండగా పట్టుకొని డీబార్ చేసినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్, డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 58 పరీక్షా కేంద్రాల్లో 25 పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు చెప్పారు. 17,896 మంది విద్యార్థులు పరీక్షలురాయాల్సి ఉండగా 492 మంది గైర్హాజరయ్యారన్నారు.

జూట్ బ్యాగుల తయారీలో శిక్షణ 7

నేడు హోలీ

సుభాష్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రంగుల పండుగ వచ్చింది. హోలీ వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా కామదాహన వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

ప్రకృతి రంగులు మేలు

హోలి ప్రధానంగా రంగుల చుట్టూ ఉంటుంది. అందుకే దీనిని





హోలి ఆడేప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పర్యావరణానికి మన చర్మానికి ఎలాంటి హాని చేయని సేంద్రియ, సహజమైన రంగుల ఎంచుకోవడం మంచిదని తెలియచేస్తున్నారు. ఎక్కువగా తిరుగకుండా, డీహైడ్రేషన్ కాకుండా ఉండాలని సూచిస్తున్నారు. వాహనాల్లో వాడే ఆయిల్ లాంటి వాటిని అస్సలు వాడవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.


జ్యోతినగర్‌లో కాముడి దహనం చేస్తున్న స్థానికులు

మార్కెట్‌లో సందడి...

పిల్లలను ఆకట్టుకునేలా స్ప్రేగన్‌లు, బెలూన్‌లు

నగరంలో హోలీ సందడి మొదలైంది. పలు దుకాణాల్లో హోలీ వేడకలకు సంబంధించి వివిధ రకాల రంగుల కొనుగోలు చేయడానికి పిల్లలు, మహిళలు మార్కెట్‌కు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా యువత తెల్ల లాల్చీలు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల రంగులు, అందులో ఎక్కువగా మార్వాడీ కలర్‌ను కొనుగోలు చేశారు. రంగుల కొనుగోలు షాపులవద్ద పిల్లలు, మహిళల సందడి చేశారు.


దుకాణాల్లో హోలీ సామాన్లు కొంటున్న నగర వాసులు

హోలీ పండుగను సురక్షితంగా జరుపుకుందాం

పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను సురక్షితంగా, బాధ్యతతో జరుపుకోవాలని పోలీసు కమీషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు పోలీస్ కమిషనర్ కొన్ని సూచనలు జారీ చేశారు.



- చర్మానికి, పర్యావరణానికి హానికరం కాని సహజ రంగులను ఉపయోగించాలి. నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులు వాడకూడదు.
- ఇతరులపై బలవంతంగా రంగులు వేయవద్దు. పరస్పర గౌరవంతో పండుగను జరుపకోవాలి.
- ఎవరైనా తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం, శారీరక లేదా మానసిక వేధింపులకు గురిచేస్తే తీవ్ర నేరంగా పరిగణిస్తారు.
- మద్యం సేవించి వాహనం నడపవద్దు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం, చట్టవిరుద్ధం.
- ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను సమూహాలుగా తరలించడం, ట్రిపుల్ రైడింగ్, వీధుల్లో అవాంఛిత రీతిలో తిరగడాన్ని అనుమతించరు.
- ప్రజాస్థలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధం. మర్యాదగా వ్యవహరించి, ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలి
- హోలీ పండుగ జరుపుకున్న అనంతరం నదులు, చెరువులు, కుంటలు వద్ద స్నానాలకు వెళ్లడం తో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచిఉంటాయి, చెరువులు, కుంటల్లో స్నానాలను ఆచరించే క్రమంలో ప్రాణాలను సైతం కోల్పోయిన సందర్భాలున్నాయి.
- ఏదైనా అత్యవసర పరిస్థితిలో డయల్ 100ను ఫోన్ చేయాలి.. లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.
- శాంతిభద్రతలకు భంగం కలిగించినా, ప్రజలకు అసౌకర్యం లేదా ప్రమాదం కలిగించే ఏ చర్యైనా తీవ్రంగా పరిగణిస్తారు. ఈ హోలీ పండుగ ప్రేమ, ఐక్యత, సంతోషాన్ని విస్తరించేలా జరుపుకుందామని సీపీ గౌస్ ఆలం సూచించారు.

నిరంతర సాధనతో సివిల్స్ సాధించవచ్చు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కఠోర శ్రమతో సివిల్స్ సాధించ వచ్చని ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. గురువారం కళాశాలలో కెరీర్ గైడెన్స్ విభాగం ద్వారా కావేరి సీడ్స్ కంపెనీ సౌజన్యంతో అప్టెక్ వారి సహకారంతో సివిల్ సర్వీసెస్, కాంపిటేటివ్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మట్లాడుతూ సివిల్ సర్వీసెస్ సాధనకు విద్యా ర్థులు డిగ్రీ స్థాయి నుంచే సాధన చేయాల న్నారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ కె సుధా కర్ మాట్లాడుతూ సంకల్పబలం, పట్టుదల, నిరంతర కార్యదీక్షతో విద్యార్థులు ముందుకుసాగాలన్నారు. ఆప్టెక్ జాబ్స్ ప్లస్, ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్ కుమార్, శ్రీనివాసరావు విద్యార్థులకు సివిల్ సర్వీసెస్‌పై అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ టి రాజయ్య, నితిన్ పాంక్, ఐక్యూ, ఏసీ సమన్వయకర్త డాక్టర్ హర్జోత్ కౌర్, టీజీసీజీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, అటానమస్ కో ఆర్డినేటర్ వంగల శ్రీనివాస్, సీవోఈ డాక్టర్ టి శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాసరెడ్డి, టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

భగత్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయిం చాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని మంకమ్మతోటలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరిస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల సంద ర్భంగా గవర్నర్ ప్రసంగంలో విద్యాశాఖపై మాట్లాడలేదన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో వసతుల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించక పోతే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు అనంపల్లి వినయ్, సహాయ కార్యదర్శి ఇసాక్, జిల్లా కమిటీ సభ్యులు రాకేష్, మంద రాకేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపయోగకరంగా యూడీఐడీ కార్డులు

సుభాష్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే వివిధ రకాల ప్రయోజనాలు పొందేందుకు యూడీఐడీ కార్డు ఉపకరిస్తుందని కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళ స్త్రీ శిశు సంక్షేమ, వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో యూడీఐడీ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే సదరం సర్టిఫికెట్ ఉన్నవారు మళ్లీ యూడీఐడీలో దరకాస్తు చేయవలసిన అవసరం లేదని తెలిపారు. వారికి ఆన్‌లైన్‌లో యూడీఐడీ కార్డు జనరేట్ అయి పోస్టులో నేరుగా వస్తుందన్నారు. కొత్తగా సదరం కోసం నమోదు చేసుకోవాలనేకునేవారు మాత్రమే యూడీఐడీ పోర్టల్ ఠఠఠ.ఠఠఠ.ఠఠఠ.ఠఠ.ఠఠలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం 21 రకాల అంగవైకల్యం ఉన్నవారికి కార్డు జారీ అవుతందన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును అధికారులు పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి కార్డు మంజూరు చేస్తారన్నారు. కార్డు కోసం ఎవరైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌పై అవగాహన లేనివారు మీసేవ సెంటర్‌లోనూ దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. యూడీఐడీ మంజూరు కోసం ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు. కార్డు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే 9490881098 హెల్ప్‌లైన్‌కు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీఆర్డీవో శ్రీధర్, డీఈవో జనార్దన్‌రావు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, దివ్యాంగుల ప్రతినిధులు, మీసేవ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో ఉచితంగా వైద్య సేవలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ

తిమ్మాపూర్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): మహిళలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఏమైనా ఉంటే ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ సూచించారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం, జిల్లా విద్యా శిక్షణ సంస్థ ఆవరణలో ఆరోగ్య హెల్త్ క్యాంపును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ 180 మంది మహిళలకు ఉచితంగా రక్త పరీక్షలు, బరువు, ఎత్తు పరీక్షించి, రక్త హీనత ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సనా జవేరియా, మహిళా ప్రాంగణం మేనేజర్ సుధారాణి, జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య పాల్గొన్నారు.


మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

హుజూరాబాద్‌లో 98 శాతం ఆస్తి పన్ను వసూలు

హుజూరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుల వసూళ్లలో అన్ని మున్సిపాలిటీల కంటే హుజూరాబాద్ ముందంజలో ఉంది. ఇప్పటి వరకు 98 శాతం పన్నులు వసూలయ్యాయి. మార్చి 31లోగా వంద శాతం పూర్తి చేస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. హుజూరాబాద్ పట్టణ జనాభా 50 వేల వరకు ఉంది. 8917 నివేశన స్థలాలు ఉన్నాయి. ప్రతి ఏటా రెండు కోట్లకు పైగా రాబడి రావాలని మున్సిపల్ అధికారులు అంచనా వేసుకుంటారు కానీ ఎప్పుడూ పూర్తి స్థాయి వసూలు కాలేదు. ఈ సారి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య 2.62 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 2.57 కోట్లు వసూలు చేశారు. మరో ఐదు లక్షలు ఈ నెల 31 లోగా వసూలుచేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకొని మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు సంబంధించిన 27 లక్షల రూపాయలు బకాయి ఉంది. వాటి వసూలు కోసం ప్రయత్నిస్తున్నారు.


హుజూరాబాద్‌లో పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

31లోగా వంద శాతం వసూలు చేస్తాం

- కె సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, హుజూరాబాద్



మార్చి 31 లోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గృహ వినియోగదారులు మున్సిపల్ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు పన్ను చెల్లించి సహకరించాలి. ఇప్పటి వరకు 98 శాతం ఆస్తి పన్నులు వసూలు చేశాం.

ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో ఫిబ్రవరి 5నజరిగిన గొడవకు సంబంధించి ఎస్సీఎస్టీ కేసునమోదుకాగా, నిందితులను గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో అక్రమంగా ఓ ఇంటిలో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జగిత్యాల టౌన్ పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు కలిసి పట్టుకున్నారు. పట్టణానికి చెందిన షేక్‌చాంద్ అనేవ్యక్తి రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గురువారం పోలీసులకు సమాచారం అందింది. తనిఖీల్లో ఓ ఇంటిలో దాచిన ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సీజ్‌చేసి చాంద్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టౌన్ ఎస్సై కిరణ్ కుమార్, డీటీ వర ప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రిమాండ్

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రంమల్లయ్య తనను తన తమ్ముడు గుర్రంనారాయణ టీఎస్36 3186గల కారుతో ఆక్సిడెంట్‌చేసి చంపాలని ప్రయత్నించాడని డిసెంబరు 2, 2024లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేశవపట్నం పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేసి గురువారం నారాయణను అరెస్టు చేసి హుజూరాబాద్ కోర్టులో హాజరుపరిచారు. నారాయణకు కోర్టు 15రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

పంటలను కాపాడుకునేందుకు

అన్నదాతల అష్టకష్టాలు

- బావుల్లో పూడికతీత
- రైతుపై అదనపు భారం
- క్రేన్లకు పెరిగిన గిరాకీ

గంగాధర/సైదాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండి పోతున్నారు. వాటిని కాపా డుకునేందుకు రైతులు తిప్పలు పడుతు న్నారు. మెట్టప్రాంతాలైన గంగాధర, సైదా పూర్ మండలాల్లో 15 మీటర్లపైన తవ్వితే గాని నీరు పడదు. పలు గ్రామాల్లో 17 మీటర్లపైన తవ్వితే బండరాయి వస్తుం టుంది. వానకాలం పంటలకు సాగునీటికి ఇబ్బంది లేకున్నా యాసంగిలోనే తీవ్ర ఇబ్బందిపడుతుంటారు. యాసంగిలో ముంద స్తుగానే నాట్లు వేస్తున్నప్పటికి గొలక దశలో పంటలకు నీరందక రైతులు అరిగోస పడుతుంటారు. పంటలను కాపాడుకునేం దుకు పలువురు రైతులు బావుల్లో పూడిక తీతను చేపట్టారు. బావులో మూడు గజాల లోతు తవ్వితే సుమారుగా మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అయినా రైతులు అప్పులు చేసి పంటలను కాపాడుకునేందుకు బావు లను మరింత లోతు తవ్విస్తున్నారు. మరో ఇరవై రోజులు పొలానికి నీరందిస్తే చేతి కొస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం గొలక వేస్తుండగా అక్కడక్కడ పొలం పొట్టకు వచ్చింది. ఈ యాసంగిలో తెలుళ్లు, చీడలు లేకపోవడంతో దిగుబడివస్తుందన్న నమ్మకంతో రైతులు అప్పులు చేసి బావుల్లో పూడిక తీయిస్తున్నట్లు తెలిపారు. బావుల్లో పూడిక తీసే క్రేన్లకు గంగాధరలో గిరాకీ ఎక్కువగానే ఉంది. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతుండగా పంటను కాపాడుకునేందుకు పూడిక తీత క్రేన్ల కూలీల వద్ద క్యూ కడుతున్నారు.

● పైపుల ద్వారా పొలాలకు నీరు.

వ్యవసాయ బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని పైపులు వేసి పారిస్తున్న ఫలితం శూన్యం. రైతన్న పంట పొలాలు దక్కించుకోవడం దిన దినంగా గండంగా మారింది. వందల ఎకరాల్లో పంట పొలాలు మరో 20రోజుల్లో చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. దీంతో ప్రతి గుంటకు పైపుల ద్వారా నీటిని పారిస్తున్నారు.



గంగాధర మండలం గర్షకుర్తిలో పూడిక తీస్తున్న కూలీలు

చేతికందే సమయంలో ఎండిపోతున్న వరి పొలం.

- భీంరెడ్డి అరుణ్‌రెడ్డి, రైతు, అమ్మనగుర్తి, సైదాపూర్ మండలం



నాకున్న మూడెకరాల్లో రెండెకరాలు సీడ్ వరి వేశాను. పంట చేతికచ్చే సమయంలో నీరు లేక పొలం ఎండిపోతుంది. వరి పొట్ట దశలో ఉంది. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి బావిలో పూడిక తీసినా గంట సేపు కూడా మోటర్ పోయడం లేదు. ఎండుతున్న వరిని ఏం చేయాలో తెలియక ఆవులు, గేదెలకు మేతగా కోసి వేస్తున్నాను.

రూ. మూడు లక్షలు పెట్టి బాయి తవ్విస్తున్నా..

- పల్ల కుంటయ్య, రైతు, గర్షకుర్తి, గంగాధర మండలం



రెండున్నర ఎకరాల భూమిలో వరి సాగు చేసిన. రోజురోజు ఎండలకు బాయిల నీళ్ల అడుగంటినయి. బాయిల ఊరినవి ఊరినట్లు పెట్టుతున్న పొలానికి సరిపోవడం లేదు లేదు. పొలం చేసినందుకు మరింత ఖర్చు పెట్టి బండరాయిని తవ్విస్తున్న. పంట పండితే ఎప్పటికైనా బాకీ తీర్చుకోవచ్చు. మూడు గజాలు తవ్విస్తే మూడు లక్షల రూపాయల ఖర్చయింది.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. కరీంనగర్‌కు చెందిన ఆదూరి అభినవ్ జగిత్యాలకు చెందిన కోనూరు శ్రీవర్ధన్ బైక్‌పై హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళుతున్నారు. మండలంలోని హన్మాజిపల్లికి చెందిన కల్లెపెల్లి సాయికృష్ణ గుండ్లపల్లి నుంచి కరీంనగర్‌కు వెళుతున్నాడు. ఈ రెండు బైక్‌లు గుండ్లపల్లి స్టేజి వద్ద మూలమలుపుపై వేగంగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు



వృద్ధురాలి చేతిపైన గాయాలు

వీర్నపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కుక్కలదాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులవివరాల ప్రకారం.. తండాకు చెందిన చింగ్లి బాయ్(85) వృద్ధురాలు ఇంటి బయటమంచంలో నిద్రిస్తుండగా కుక్కలుఒకసారిగా దాడి చేశాయి. దాడిలో రెండు చేతులకు, కడుపుపైన తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

బస్సు ఢీకొని ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్య మృతి

శంకర్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతిచెందగా, మరోవ్యక్తికి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వహించే రవిందర్ తనకుటుంబంతో కలిసి మోకిలలోని ఎన్‌సీడీ ఎవెన్యూలో కొన్నాళ్లుగా నివాసముంటున్నాడు. హోండాయాక్టివాపై భార్యాభర్తలు రవిందర్, ఉమాదేవి బుధవారం సాయంత్రం పని నిమిత్తం నార్సింగికి వెళ్లారు. పని ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా, మోకిలలోని సుబిషి విండ్‌సర్ హోమ్స్ వద్ద అతివేగంగా వెను కనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొది. దీంతో హోండా యాక్టివాపై ఉన్న రవిందర్, ఉమాదేవి కిందపడిగా వారికి తీవ్రగాయాల య్యాయి. వారినివెంటనే చికిత్సనిమిత్తం కుటుంబీకులు, స్థానికులు శంకర్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఉమాదేవిని సంగారెడ్డిలోని ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె అప్పటికే చనిపోయిందని డాక్టర్లు తెలిపారు. గాయపడిన రవిందర్ గచ్చిబౌలిలోని సన్‌షన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగాఎక్సైజ్ సూపరింటెండెంట్ రవిందర్ ఈనెల31న రిటైర్డు అవ్వనున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చొప్పదండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చొప్పదండికి చెందిన తాళ్లపల్లి అమృతవ్వ(70) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ అనూష కథనం ప్రకారం.. తనకుమారుల భూమి గొడవల కారణంగా మనస్థాపంతో జీవితంపై విరక్తిచెందిన అమృతవ్వ ఇంట్లోఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

మైనర్లు నడుపుతున్న వాహనాలు సీజ్

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురు వారం ఇందిరాచౌక్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాహనాలు నడుపుతున్న 15మంది మైనర్‌లనుపట్టుకుని, వాహనాలను సీజ్‌చేశారు. అలాగే శబ్ధ కాలుష్యానికి కారణమవుతున్న రెండు ద్విచక్రవాహనాలను పట్టుకుని ఠాణాకు తరలించారు. పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని విద్యార్థులకు పరీక్షల జరుగుతున్నందున పెద్దపెద్ద శబ్దాలు చేసే వాహనాల యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ అన్నారు. ఈతనిఖీలలో ట్రాఫిక్‌సీఐ పర్శరమేష్, ఎస్‌ఐ ఉపేంద్రచారి, ఆర్‌ఎస్‌ఐ గణేష్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు

వీర్నపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామంలో ఇండ్లలో నిల్వ చేసిన గుడుంబా స్థావరాలపై ఎస్‌ఐ ఎల్లాగౌడ్‌తో కలిసి పోలీసులు గురువారం దాడులు చేశారు. దాడుల్లో 950 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసంచేశారు. సారా తయారీకి ఉపయోగించే 25 కిలోల బెల్లం, 20 లీటర్ల గుడుంబా, పట్టుకొని సీజ్ చేశారు. సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, బిందెలను పగలగొట్టారు. సారా తయారుచేస్తున్న వ్యక్తిపై వివిధ సెక్షన్లలో ఆరుకేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండాలలో గుడుంబా తయారు చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దాడుల్లో ఎస్‌ఐ ఎల్లాగౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు బాబు, లక్ష్మణ్, సిబ్బంది మల్లాగౌడ్, కార్తీక్, యాకుబ్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేసిన వ్యక్తికి జరిమానా

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల ద్వారా దూషిస్తూ, అసత్య ప్రచారం చేసిన కేసులో ఒకరికి రూ.5వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు సెకండ్ అడిషనల్ న్యాయమూర్తి వినీల్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి ఎరవేణి రమేష్‌పై అదేగ్రామానికి చెందిన మహ్మద్‌నజీర్ అనేవ్యక్తి సామాజిక మాధ్యమాలద్వారా తప్పుడు ప్రచారంచేశాడు. తీవ్ర మానసికక్షోభకు గురైన రమేష్ 2020లో జరిగిన విషయాన్ని గొల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై జీవన్ కేసు నమోదుచేశారు. కోర్టు డ్యూటీఅధికారులు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరంరుజువు కావడంతో ముద్దాయి నజీర్‌కు జరిమానావిధిస్తూ న్యాయమూర్తితీర్పు వెలువరించారు.

రిటైర్డ్ తహసీల్దార్‌పై కేసు నమోదు

చందుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామంలో వ్యవసాయభూమిని అక్రమంగా పట్టాచేసిన రిటైర్డ్ తహసీల్దార్ బాలయ్యపై కేసు నమోదుచేసి, నోటీసు జారీ చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సీఐకథనం ప్రకారం మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల ఎల్లయ్యకు చెందిన 898 సర్వేనంబర్‌లోని 18గుంటల వ్యవసాయ భూమినిఇదే గ్రామానికి చెందిన పత్తిపాక దేవరాజుకు 2005లోఅక్రమంగా పట్టాచేశారని ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి నోటీసులు ఇచ్చినటుసీఐ పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి హల్‌చల్

- మద్యం మత్తులో బీరు సీసాతో తలపై గాయపరుచుకున్న వైనం
- తన భార్యను కాపురానికి వచ్చేలా చూడాలని వేడుకోలు



పోలీస్‌స్టేషన్ ఎదుట గాయపడిన యువకుడు శివరాం

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట శివరాం అనే యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. తన భార్యను కాపురానికి పంపాలని పోలీసులను వేడుకుంటూనే బీరు సీసాతో తలపై గాయపరుచుకుని అరగంటకు పైగా ఆందోళనకు దిగాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బేడబుడుగ జంగాల కాలనీకి చెందిన మంజుల అనే మహిళతో కరీంనగర్ జిల్లా రామడుగుకు చెందిన శివరాంకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలు, ఓ కేసులో జైలు శిక్ష అనుభవించిన శివరాంతో కాపురం చేయడం ఇష్టం లేక మంజుల జగిత్యాలలోని తన పుట్టిన ఇంట్లోనే కొద్ది కాలంగా ఉంటోంది. గురువారం తన భార్యను కాపురానికి పంపాలని పెద్ద మనుషులను శివరాం వేడుకున్నప్పటికీ వెళ్లేందుకు మంజుల ఒప్పుకోలేదు. తీవ్ర మనస్థాపానికి గురైన శివరాం జగిత్యాల పట్టణపోలీస్ స్టేషన్‌కు మద్యం మత్తులో వచ్చి బీరు సీసాతో తలపై కొట్టుకున్నాడు. ఎస్సైలు కిరణ్ కుమార్, మన్మదరావు, గీతలతో పాటు పోలీసు సిబ్బంది శివరాంకు నచ్చజెప్పడంతో తన ఆందోళనను విరమించాడు. పోలీస్ స్టేషన్ ఎదుట బీరుసీసా ముక్కను చేతిలో పట్టుకొని భయభ్రాంతులకు గురి చేసిన శివరాంపై పోలీసులు న్యూసెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

- నగదు, నగలు, ఇతర సామాను దగ్ధం
- సుమారు రూ.25లక్షల ఆస్తి నష్టం

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో గురువారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి సుమారు రూ.25లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. బాధితుడు ముద్రకోలా గోపి తెలిపిన వివరాలు ప్రకారం.. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముద్రకోలా గోపి కొన్నేళ్లుగా గ్రామంలో గాజులు, ఫ్రిడ్జ్, కుర్చీలు, కూలర్లు, మిక్సీలు, తదితర వస్తువులు అమ్ముతున్నాడు. రోజువారి లాగానే గురువారం ఉదయం భార్య స్వప్నతో పాటు గోపి ఇతరగ్రామాలకు వ్యాపారం చేసుకోవడానికి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకోవడంతో గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి ఇంట్లో ఉన్న రూ.1.20లక్షల చిట్టీ డబ్బులు, కంగన్‌హాల్ వస్తువులు, 5తులాల బంగారం, 20తులాల వెండీ అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈప్రమాదంలో సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. కాగా కేశవపట్నం పోలీసుల తోపాటు ఆర్ఐ బాలకిషన్ లింగాపూర్ చేరుకొని వివరాలు సేకరించారు.



దగ్ధమైన నగదు

‘వైఫై’ విషయంలో ఇద్దరి మధ్య గొడవ

- కుటుంబ సభ్యులపై దాడి
- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- హత్య కేసు నమోదు



బహదూర్ భగత్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌నెట్ వైఫై విషయంలో జరిగిన చిన్న గొడవ ఒకరి హత్యకు దారితీసింది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఇద్దరు వర్కర్ల మధ్య బుధవారం మధ్యాహ్నం 'వైఫై విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో కరీంనగర్ కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న భగత్(40) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరీంనగర్ మూడోఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల చౌరస్తా ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న బహదూర్ రాజుకు, అదే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న జగదీష్‌మధ్య బుధవారం మధ్యాహ్నం చిన్నగొడవ జరిగింది. ఒక కస్టమర్‌కు వైఫై పాస్‌వర్డ్ చెప్పే విషయంలో ఇద్దరు గొడవపడి కొట్టుకున్నారు. అనంతరం జగదీష్ ఇంటికి వెళ్లిపోయి అర్ధరాత్రి మళ్లీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రాగా అతనికి బహదూర్‌రాజు సారీ చెప్పాడు. అయితే తనను అకారంగా బహదూర్‌రాజు కొట్టాడనే విషయాన్ని గురువారం ఉదయం జగదీష్‌తన బంధువులకు చెప్పుకున్నాడు. దీంతో జగదీష్‌తోపాటు మరికొందరు కలిసి ఉదయం 10గంటలసమయంలో కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న బహదూర్‌రాజు ఇంటికి వెళ్లి బహదూర్ రాజు, అతనిసోదరుడు ఆకాశ్, తండ్రిభగత్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో జగదీష్, అతనిసోదరులు బహదూర్ శంకర్, భారత్, దీపక్, కృష్ణ కలిసి ముగ్గురి కళ్లల్లో కారం పొడి చల్లి, కర్రలతో దాడిచేశారు. దీంతో బహదూర్ రాజు, ఆకాశ్ అక్కడినుంచి తప్పించుకుని పారిపోగా తండ్రి భగత్‌కుతీవ్రంగా రక్తగాయాలయ్యాయి. భగత్‌ను మొదట ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా సాయంత్రంభగత్ మృతిచెందాడు. మృతుడికొడుకు బహదూర్‌రాజు ఇచ్చిన ఫిర్యాదుతో జగదీష్, అతనిసోదరులపై హత్యకేసు నమోదుచేశామని, విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయగూడెం గ్రామంలోని కిరాణాషాపులో గురువారం చోరీ జరిగింది. బాధితురాలు బూర్ల లక్ష్మి తెలిపిన వివరాలప్రకారం.. కిరాణాషాపులో మహిళా సంఘాలకు సంబంధించిన12వేల నగదు ఉంచి బుధవారం సాయంత్రం షాపు తాళం వేశారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తలుపులకున్న గొల్లాన్ని ఊడదీసి లోపలివస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. క్యాష్‌కౌంటర్‌లో ఉంచిన నగదు మాయమైంది. ఈఘటనపై కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ల చోరీ

వీణవంక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 3కంప్యూటర్లు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఎస్‌ఐ తోట తిరుపతి కథనం ప్రకారం.. పాఠశాలలో 11కంపూటర్లు ఉండగా ఈనెల 8,9వ తేదీలు సెలవులు రాగా 11న పాఠశాల కంప్యూటర్ ఇన్‌చార్జీ వెళ్లి చూడగా మూడు కంప్యూటర్లు కనిపించలేదు. మూడింటి విలువ దాదాపు రూ.20,000 ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి/సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల్లో అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రాజేందర్ తెలిపారు. గురువారంజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు అందిన పక్కాసమాచారంతో పెద్దపల్లిలోని బండారికుంట, సుల్తానాబాద్ మండలంలోని దేవుని పల్లి గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీచేశారు. డీఎస్ఓ రాజేందర్ మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం దేవునిపల్లిలో నిల్వ ఉన్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, పెద్దపల్లిలోని బండారి కుంట వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. మొత్తం 65 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేశామన్నారు. సీజ్‌చేసిన రేషన్‌బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని, ఆటోను పోలీస్‌స్టేషన్లో అప్పగించామని డీఎస్ఓ తెలిపారు.వాహనంయజమాని, డ్రైవర్, అక్కడపని చేస్తున్న ఇతరలేబర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీలలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రవీందర్, మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తమ సోదరుడి వ్యవసాయ పొలంలోకి కలుషితనీరువస్తున్నాయని పేర్కొంటూ రైస్‌మిల్లులోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించిన సంఘటనలో మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ల్యాగలశ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గొల్లపల్లి గ్రామంలోని పొన్నాలదేవరెడ్డి గ్రామశివారులో శ్రీరాజరాజేశ్వర రైస్ మిల్లును నడిపిస్తున్నాడు. ఈనెల 12న సాయంత్రం తన వ్యాపార భాగస్వామి అయిన రాజిరెడ్డితో కలిసి రైస్‌మిల్లులోని కార్యాలయంలో ఉండగా శ్రీనివాస్‌రెడ్డి లోనికి వచ్చి కలుషిత నీరు పొలాల్లోకి వస్తున్నాయని గొడవకుదిగాడని చెప్పారు. అసభ్యపదజాలంతో దూషిస్తూ ఇనుప రాడుతో కార్యాలయ తలుపును ధ్వంసం చేశాడని పేర్కొన్నారు. బాధితుడు దేవరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదకరంగా గన్నేరువరం చెరువు కల్వర్టు

- రెండు వైపులా కుంగిన సీసీ రోడ్డు
- పొంచి ఉన్న ప్రమాదం



చెరువు వద్ద కల్వర్టు పైన రెండు వైపులా కుంగిన సీసీ రోడ్డు

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టుపై సీసీరోడ్డు రెండు వైపులా కుంగి ప్రమాదకరంగా మారింది. బస్సులు, భారీ వాహనాలు కల్వర్టుపై వెళితే వాహనాలు అదుపు తప్పి ప్రమాదం జరిగే అవకాశంఉంది. కుంగిన కల్వర్టుకు ఒకపక్కచెరువు మత్తడితో కూడినలోతైన ప్రదేశం, మరోపక్క చెరువు ఉండడంతో రెండువైపులా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. నిత్యం ఈ దారిగుండా గన్నేరువరం నుంచి పొత్తూరు మీదుగా కరీంనగర్‌కు బస్సులు వెళుతుంటాయి. అంతేకాకుండా ప్రైవేట్‌వాహనాలు, ద్విచక్రవాహన దారులు భారీసంఖ్యలో వెళ్తుంటాయి. రాత్రిసమయంలోనూ ఈదారిగుండా ప్రయాణిస్తుంటారు. చెరువుకట్ట నుంచి కిందకు దిగే ప్రదేశంలోనే కల్వర్టుపై సీసీరోడ్డు కుంగిపోయి ఉండడంతో ఆదమరిచి రోడ్డుకు పక్కకు వెళితే ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఉంది. ఎదురుగా వాహనంవస్తే ఆగాల్సిందే. వాహనదారులు ఈదారిగుండా వెళ్లడానికి జంకుతున్నారు. కల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జినిర్మిస్తే ప్రయాణం సులువవుతుందని వాహనదారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మండలానికి డబుల్‌రోడ్డుతోపాటు హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించేందుకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రమాదాలు జరగకముందు అధికారులు స్పందించివెంటనే డబుల్ రోడ్డుపనుల్లో భాగంగా కుంగిన లోలెవల్ కల్వర్టును తొలగించి వెంటనే హైలెవల్‌బ్రిడ్జీని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు

ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్

- పాఠశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను చూపెడుతున్న చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామంలోగల స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసికదివ్యాంగుల పాఠశాలకు ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికేట్ గుర్తింపు లభించిందని పాఠశాల చైర్మన్, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. క్వాలిటీ మెనేజ్‌మెంట్ సిస్టం అనే సర్టిఫికేట్ నిర్వాహకులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సర్టిఫికేట్‌కు మూడు సంవత్సరాల వరకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. క్యూఆర్ఏ ఢిల్లీ సంస్థ వారు దివ్యాంగుల పాఠశాలను సందర్శించి, అన్నిరకాల పరిశోధనలుచేసి ఐఎస్‌వో సర్టిఫికేట్ విడుదల చేసినందుకు పాఠశాల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సర్టిఫికేట్ ద్వారా దేశ,విదేశాలలో ఈ పాఠశాలకు గుర్తింపు వస్తుందని చాడవెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు కోమిరెల్లా రెడ్డి, ఎల్ మధుసుధన్‌రావు, గాజుల భగవాన్ నేత, జాప వెంకటరమణారెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ సతీష్, ఈవో బాలరాజు, వార్డెన్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయి

● ఎస్‌యూ వీసీ యు ఉమేష్‌కుమార్



మాట్లాడుతూన్నా ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సెమినార్లు విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలో రెండు రోజుల సెమినార్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్-ఎ కీ క్యాటలిస్ట్ ఇన్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్మెంట్ ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఇలాంటి రెండురోజుల సెమినార్ నిర్వహించిన డాక్టర్ డి హరికాంత్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ ఈ రెండురోజుల సెమినార్‌లో మొత్తం114 పరిశోధకపత్రాలు పంపించాని అందులో 74పేపర్ ప్రెజెంటర్స్ తమ రీసెర్చ్ పేపర్స్‌ని వివరిస్తూ వివిధ అంశాలపైన తమ పరిశోధనలు వివరిస్తూ సమాజానికి ఉపయోగపడే అంశాల గురించి చర్చించారని తెలిపారు. విశిష్ట అతిథి కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రస్తుత సమయంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనేది చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో విశిష్టఅతిథులుగా కే ప్రతాప్ రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్- ఎస్ఆర్‌సి హైదరాబాద్, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, రిజిస్ట్రార్ శాతవాహన యూనివర్సిటీ, ప్రొఫెసర్ చెన్నప్ప రిజిస్ట్రార్, పాలమూరు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ ఆకుల రవి, డీన్ కామర్స్ డిపార్ట్మెంట్ శాతవాహన విశ్వవిద్యాలయం, వాణిజ్య శాస్త్ర ఆచార్యులు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అతిథులుగా హాజరయ్యారు.

బ్యాంకింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 15వ తేదీనుంచి ఏప్రిల్8వరకు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈశిక్షణకు బిసి-ఎ, బి,డికి చెందిన, డిగ్రీపూర్తిచేసి 26సంవత్సరాల వయస్సులోపు ఉన్న అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో 2లక్షల లోపు ఉండాలని. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ 12-4-2025తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.వచ్చిన మార్కుల ఆధారంగా 30మందిని అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో శిక్షణకు..

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థలో హౌస్ వైరింగ్, ఫొటోగ్రఫీ అండ్ వీడియాగ్రఫీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్నట్లు దీనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకుచెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆసక్తిగల పురుషులు దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు. 30రోజుల పాటు ఈ ఉచితశిక్షణ ఉంటుందని ఎంపికైనా అభ్యర్థులకు ఉచితవసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెతిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు 9849411002, 7981151653 నంబర్లను సంప్రదించాలని కోరారు.


జ్యూట్ బ్యాగు కట్టింగ్‌పై శిక్షణ తీసుకుంటున్న మహిళలు


శిక్షణలో మహిళలు తయారు చేసినవివిధ రకాల జ్యూట్ బ్యాగులు



జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

● తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రంలో నెల రోజుల కోర్సు
● శిక్షణ పొందుతున్న మహిళలకు భోజన సౌకర్యం

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్..ప్లాస్టిక్.. పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించినా ఏదో ఓ రూపంలో ముందుకువస్తోంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులు వాడాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.

● కలెక్టర్ చొరవతో..

కొన్నేళ్లుగా మండలంలోని దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం(మహిళా కేంద్రం)లో మహిళాలకు ఇచ్చే ఉచిత శిక్షణలు కనమరుగయ్యాయి. ఇటీవల ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి పరిస్థితిని గమనించారు. వారి చొరవతో ఉచిత శిక్షణను తిరిగి ప్రారంభించారు. ఫిబ్రవరి 14 నుంచి జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణను ప్రారంభించారు. నెల రోజుల ఉచిత శిక్షణతోపాటు శిక్షణ పొందుతున్న వారికి మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది మహిళలు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం వారు జ్యూట్ బ్యాగుల తయారు చేసి విక్రయించే విధంగా చిన్న పరిశ్రమ పెట్టుకునేందుకు ప్రభుత్వం నుంచి అర్హులైనా వారికి సహకారం కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శిక్షణ బాగుంది..

- కె కోమల, కట్టరాంపూర్, కరీంనగర్



నేను మహిళా ప్రాంగణంలో జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ బాగుంది. ప్రతి రోజు ఓ రకమైన బ్యాగులను తయారు చేయడం నేర్పిస్తున్నారు. మహిళా గ్రూప్‌లో ఉన్న నాలుగురు సభ్యులం కలిసి ఈ శిక్షణ తీసుకుంటున్నం. శిక్షణ అనంతరం నాలుగురం కలిసి సొంతంగా జ్యూట్ బ్యాగుల తయారు పరిశ్రమ పెట్టుకుంటాం.

గ్రామాల్లో జ్యూట్ బ్యాగులను వాడేవిధంగా కృషి చేస్తాం

- రేవతి, పోరండ్ల



గ్రామాల్లో జ్యూట్ బ్యాగులపై అవగాహన ఉండదు. వీటిని తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించి విక్రయిస్తాం. పర్యావరణ పరిరక్షణతోపాటు ఉపాధి లభిస్తుంది. రైతులు, విద్యార్థులు, ఇంట్లో వస్తువులు కొనుగోలు చేసి తీసుకువెళ్లేందుకు ఈ జ్యూట్ బ్యాగులు ఉపయోగపడుతాయి. పర్యావరణ పరిరక్షణకు జ్యూట్ బ్యాగులు వాడల్సిన అవసరం ఉంది.

25 మంది శిక్షణ పొందుతున్నారు..

- సవిత, ట్రైనర్



ప్రస్తుతం 25 మంది మహిళలు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందుతున్నారు. వారికి ప్రతి రోజు ఒక రకం బ్యాగు తయారు చేయడం నేర్పిస్తున్నాం. తక్కువ మార్జిన్‌తో బిజినెస్ ఎలా ప్రారంభించాలి, మార్కెటింగ్ ఎలా చేయాలి అనే దానిపై శిక్షణ అందిస్తున్నాం. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జ్యూట్ బ్యాగుల అర్డర్లు కూడా ఇప్పిస్తాం.

మహిళలకు ఉపయోగకరం

- వి సుధారాణి, జిల్లా మేనేజర్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి చొరవతో ప్రాంగణం తిరిగి ప్రారంభమైంది. జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకు కలెక్టర్ ఆర్థిక సహకారం అందిస్తున్నారు. మహిళలకు శిక్షణతో పాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళాలకు సర్టిఫికేట్‌తో పాటు సొంతంగా వ్యాపారం నిర్వహించుకునేందుకు ఆర్థిక వనరులు, రుణం అందిస్తాం. ఈ శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

యోగా చాంపియన్‌కు సన్మానం

● అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
● కలెక్టర్ పమేలా సత్పతి


ఆమని పటేల్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్/సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేషనల్ యోగా చాంపియన్‌షిప్‌లో ఐదవస్థానం కైవసం చేసుకున్న ఆమనిపటేల్ జాపతిని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఘనంగా సన్మానించారు. జాపతి ఆమని గతనెలలో కేరళలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయ సీనియర్స్ యోగాసన చాంపియన్‌షిప్‌లో రాణించి ఐదవస్థానం సాధించింది. ఈసందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ యోగా అసోసియేషన్, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యుల సమక్షంలో ఆమనిని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులు కొన్ని నెలలుగా అద్భుతమైన ప్రదర్శనతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించడం సంతోషదాయకమన్నారు. ప్రతిభావంతులకు ప్రభుత్వం పక్షాన ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడశాఖ అధికారి వి శ్రీనివాస్, తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, యోగా కోచ్‌లు వి కిష్టయ్య, గుంటి రామకృష్ణ, పి మల్లేశ్వరి, జె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తజన సందడి


వేంకటేశ్వర స్వామి వారి ఊరేగింపు

ధర్మపురి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తజన సందడి నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామివారలను అశ్వవాహనంపై ఊరేగించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రాల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధఆలయాల్లో ఆలయ వేదపండితులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారలకు మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం పక్షాన 6వేలమంది భక్తులకు అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆలయానికి రూ.8,03,092 ఆదాయం లభించింది. ఇందులో వివిధరకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.2,86,216 ప్రసాదాలు విక్రయించగా 4,61,000 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ.55,876 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఆయాకార్యక్రమాల్లో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి లో శ్రీ పాత (యోగ) నారసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శ్రీ సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

కొండగట్టులో గిరిప్రదక్షిణ

● కొండ చుట్టూ 5.7కి.మీల మేర నడకమార్గం
● అభివృద్ధికి సొంత డబ్బులు అందించిన మంత్రి పొన్నం
● పూర్తయిన పనులు

మల్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో గిరిప్రదక్షిణకు వస్తున్న భక్తుల సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. 2023 నుంచి ప్రతి పౌర్ణమి రోజు గిరిప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. 2023లో చిలుకూరుకు ఆత్మారాం సురేశ్‌శర్మ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ ప్రారంభించారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరిప్రదక్షిణ 26వది.కొండగట్టు చుట్టూ ప్రస్తుతం 5.7కి.మీ మేర గిరిప్రదిక్షణకు నడక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు అయిన మూడు లక్షల రూపాయలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అందించారు. దిగువ కొండగట్టు స్టేజీ వద్ద ఉన్న హనుమాన్ విగ్రహం నుంచి ఘాట్‌రోడ్డు, వై జంక్షన్ మీదుగా జేఎన్‌టీయూ మార్గంలోని బొజ్జపోతన ఆలయం వరకు మూడు కిలోమీటర్లు, అక్కడి నుంచి గుట్టను ఆనుకొని మంచి నీళ్ల బావి, సంతోళ్లద్ది నుంచి మెట్ల మార్గం వరకు మరో 2.7కి.మీలతో నడకమార్గం ఏర్పాటయింది. దీంతో గిరిప్రదక్షిణ సులువు కావడంతో వందలాదిగా భక్తులు పాల్గొంటున్నారు. ఈ మార్గం ఏర్పాటు కాకముందు దిగువ కొండగట్టు, దొంగలమర్రి, జేఎన్‌టీయూ, రాంసాగర్, మద్దుట్ల, నూకపల్లి, మల్యాల క్రాస్‌రోడ్డు, కొండగట్టు వరకు సుమారు 24 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ చేశారు. ప్రస్తుతం అది 5.7 కిలోమీటర్లకు తగ్గడంతో భక్తులకు సౌకర్యంగా మారింది.



కొండగట్టు గుట్ట చుట్టూ ఏర్పాటు చేసిన నడక మార్గం

● అభివృద్ధితో భక్తులకు సౌకర్యం

ప్రస్తుతం చదును పనులు పూర్తి చేసుకున్న గిరిప్రదక్షిణ నడకమార్గాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సి ఉంది. మట్టి రహదారి కావడంతో భక్తులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఆయాసం వచ్చినప్పుడు, సేదతీరడానికి బెంచీలు, నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. గిరిప్రదక్షిణ మార్గాన్ని అభివృద్ధి చేస్తామని స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం తెలిపారు.

సమాజహితం కోసమే

- ఆత్మారాం సురేశ్‌శర్మ మహరాజ్, గిరిప్రదక్షిణ ప్రారంభకులు



భక్తులందరినీ ఒక చోట చేరుస్తూ వారికి భగవంతుడి శక్తిని ప్రసాదించడం కోసం ఈ గిరి ప్రదక్షిణ చేపట్టాం. వందలాదిగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటున్నారు. భక్తులు ప్రతి నెలా గిరిప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. సమాజ హితం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం.

మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళనతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మృతిచెందిన పూసాల రోహిత్

చొప్పదండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళనతో ఓ ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌లో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అనూష కథనం ప్రకారం.. రుక్మాపూర్‌కు చెందిన పూసాల రోహిత్(17) కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి వరకు చదువుకున్న రోహిత్ గురువారం వేకువజామున ఇంటిముందు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళన చెంది ఉరివేసుకొని మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో సత్తా చాటిన అగ్రహారం విద్యార్థులు



పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

వేములవాడ టౌన్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో సత్తాను చాటారు. ప్రభుత్వడిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులు కాంపాక్ట్ డిస్క్ యాజ్ ఏ డిఫ్రాక్షన్ గ్రేటింగ్ అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనలో, కంపాక్ట్ డిస్క్‌ద్వారా కాంతి వివర్తనాన్ని ఎలా ప్రదర్శించవచ్చో, డిస్క్‌లోని వలయాల మధ్యదూరాన్ని లేజర్‌కాంతి సహాయంతో ఎలా నిర్ణయించవచ్చో విశ్లేషించారు. ఈ ప్రయోగం భౌతికశాస్త్రంలో కాంతి వివర్తన లక్షణాలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నిర్వహించిన జిజ్ఞాస కార్యక్రమం రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఈ ప్రాజెక్టు ఎంపికైందని, భౌతికశాస్త్ర విభాగ విద్యార్థులు, ప్రాజెక్టు సూపర్‌వైజర్ డాక్టర్ ఎస్. కృష్ణప్రసాద్ నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టి లావణ్య పరిశోధనలో పాల్గొన్న విద్యార్థులను ప్రాజెక్టు సూపర్‌వైజర్‌ను అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం శివారులో గురువారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా చొక్కారావుపల్లి నుంచి ఆటోలో సుమారు 4 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని మండల కేంద్రానికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. గన్నేరువరానికి చెందిన గంటా కొమురయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజన్న ఆలయంలో ఘనంగా డోలోత్సవం

వేములవాడ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం డోలోత్సవం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డోలోత్సవం కార్యక్రమంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికిభక్తులుహాజరైమొక్కులు చెల్లించుకున్నారు.


డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఇద్దరికి రిమాండ్

జగిత్యాలక్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి పంపిస్తానని రూ.3.5 లక్షలు తీసుకుని మోసగించిన కేసులో ఇద్దరు వ్యక్తులను జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనే వ్యక్తిని ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి పంపి స్తామని చెప్పి జగిత్యాల పట్టణానికి చెందిన అల్లెపు వెంకటేష్, చల్ల మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు మోసానికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు బుధవారం అల్లెపు వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు. 24 గంటల వ్యవధిలోనే మరో నిందితుడైన చల్ల మహేష్ గురువారం పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణు గోపాల్ పేర్కొన్నారు.

జ్యూరీ సభ్యుడిగా డాక్టర్ రవిచంద్ర


డాక్టర్ రవిచంద్ర

కరీంనగర్ కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నేపాల్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. నేపాల్‌లో ఈనెల 19నుంచి 25వ తేదీవరకు జరగనున్న ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్‌రీజియన్ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్రను నియమించినట్లు ఫెస్టివెల్ చైర్‌పర్సన్ కెపిపాఠక్ తెలిపారు. జ్యూరీ సభ్యులు ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ ఫీచర్‌ఫిల్మ్ అవార్డు కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమచిత్రాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి తనకూతురితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితకుటుంబ సభ్యులు 2021లో జగిత్యాలరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై చిరంజీవి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు ఎస్సైలు చిరంజీవి, శ్రీకాంత్, కానిస్టేబుళ్లు నరేష్, శ్రీధర్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సీపీ

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. హోలీ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యగా నగరంలోని ప్రార్థనా స్థలాల వద్ద, ముఖ్య కూడళ్లలో, సున్నిత ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. నగరంలోని సున్నితమైన ప్రాంతాల్లో, సమస్యాత్మక ప్రాతాల్లో గురువారం సాయంత్రం నుంచే పోలీసులను మోహరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గురువారం రాత్రి నగరమంతటా తిరుగుతూ పోలీసు బందోబస్తును పరిశీలించి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కాముని దహనం కార్యక్రమాన్ని నగరంలోని పలు ప్రాంతాల్లో సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ హోలీ పండుగ చాలా ప్రాముఖ్యత కలిగిందని, ఈ పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని, పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. పండుగ వేళ శుక్రవారం నగరంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడినవారిపై చట్టప్రకారం చర్యలుంటాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలుగకుండా, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా హోలీ జరుపుకోవాలన్నారు.


బందోబస్తుపై అధికారులతో మాట్లాడుతున్న సీపీ

మహిళా డిగ్రీ కళాశాలలో హోలీ రంగుల తయారీ

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని జీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మొక్కలు, పూల నుంచి సహజ సిద్ధంగా రంగులను తయారు చేసి వాటి ఆవశ్యకతను వివరించారు. రసాయనర రంగులతో ఎన్నో రకాల చర్మ సంబంధమైన సమస్యలు ఉంటాయన్నారు. రసాయన రంగులు నోటి ద్వారా పొట్టలోకి చేరి జీర్ణ సంబంధమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సహజసిద్ధ రంగులనే వాడాలని సూచించారు. వివిధ రకాల మొక్కలు, పుష్పాలను ఉపయోగించి ప్రకృతి సిద్ధమైన రంగులను తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్,డాక్టర్ సుజాత,డాక్టర్ దేవేందర్,డాక్టర్ తిరుపతి, నారాయణ. ఇక రాణి, రవళి,అనిత, మౌనిక, రమ్య పాల్గొన్నారు.


రంగులు తయారు చేస్తున్న విద్యార్థినిలు

అక్షర శక్తిని చాటిన గ్రంథం శ్రీదేవీ వైభవం

- డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ

కరీంనగర్ కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అక్షర శక్తిని చాటిన పారాయణం చేయదగిన గ్రంథం శ్రీదేవీ వైభవమని శ్రీశృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు, బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ అన్నారు. గురువారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీకళాశాలలో బ్రహ్మశ్రీపెండ్యాల కిషన్‌శర్మ రచించిన శ్రీదేవీవైభవ గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

కరీంనగర్‌టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాములను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యా సంస్థల్లో ఘనంగా హోలీ వేడుకలు


హోలీ వేడుకల్లో ఆల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి


వింధ్యావాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రశాంత్


అచీవర్స్‌లో విద్యార్థుల సంబరాలు

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆల్ఫోర్స్ టైటానిక్స్ ప్రాంగణంలో హోలీ పండుగ ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం జరిగిన ఈ వేడుకలకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలని ఆకాక్షించారు.

- కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో హోలీ వేడుకలు ఉల్లాసంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రసాయన రంగులను చల్లుకోవడం వలన జరిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి హోలీ విశిష్టతను తెలిపారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో గురువారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ పాల్గొన్నారు.

● భగత్‌నగర్: రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో గురువారం ముందస్తు హోలీ సంబురాలు నిర్వహించారు. కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, మల్లయ్య, వెంకట్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి ఉన్నారు.

● సుభాష్‌నగర్: హోలీ ముందురోజు కామదహనం చేస్తారు. నగరంలోని భగత్‌నగర్ చౌరస్తాలో కామదహనం చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద విద్యానికేతర్ చైర్మెన్ సౌగాని కొమురయ్య, గౌంటి సుధాకర్, నాంపల్లి రమేశ్, మర్రి వంశీ, కనం శ్రీను, తోట రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


భగత్‌నగర్ చౌరస్తాలో కామదహనం

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కరీంనగర్ జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్‌శ్రీనివాస్‌రావు అన్నారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 7,357 ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారన్నారు. బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మీ.లీ., సాఫ్ 2 గ్రాములు ఏదైనా ఒకమందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువైనపుడు డైమిథోయేట్ 2 మి.లీ, థయాఎసిపేట్ 1.5 గ్రాములు, సైనోపాడ్ (ట్రేసరు) 0.3 మి.లీ, థయోమిథాక్సమ్ (ఆక్టరీ) 0.3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తామర పురుగు అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి పిప్రోనిల్ 2. మి.లీ., ఎసిపేట్ 1.5 గ్రాములు, సైనోసాడ్ (ట్రెసర్) లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పిండినల్లి నేల నుంచి చెట్టుపైకి పాకకుండా చెట్టు ప్రధాన కాండంపై గ్రీజు పూసిన ప్లాస్టిక్ పేపర్లను భూమినుంచి ఒకటిన్నర అడుగుల ఎత్తులో కాండం చుట్టూ చుట్టాలని తెలిపారు.

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి: కలెక్టర్

తిమ్మాపూర్, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌పై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండల కేంద్రంలో జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ ట్రాఫిక్ పార్కును ఆమె గురువారం సందర్శించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ట్రాఫిక్‌పై పిల్లలకు అవగాహన కలిగించే అన్నిరకాల బోర్డులు, గుర్తులు, సిగ్నల్స్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు.

అన్ని పాఠశాలల విద్యార్థులు ట్రాఫిక్ పార్కును సందర్శించేలా చూడాలన్నారు. ప్రతిగుర్తు గురించి పిల్లలకు వివరించాలని అన్నారు. పార్కు సందర్శించేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులను పలకరించారు. అనంతరం క్యాంటీన్‌ని పరిశీలించి స్వశక్తి కేంద్రాల ద్వారా నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో అదనపుకలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా రవాణాశాఖ కమిషనర్ పురుషోత్తం, డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవిఐ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ పార్కులో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాగునీటి కోసం బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో

గంగాధర, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పంటలకు సాగునీరందించాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం గంగాధరలో రాస్తారోకో చేపట్టారు. మధురానగర్‌లో కరీంనగర్, జగిత్యాల ప్రధానరహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు పిలుపునివ్వగా ముందస్తుగా మాజీ ఎమ్మెల్యే సుంకెరవిశంకర్‌ను హౌస్ అరెస్టు చేశారు. మధురానగర్ చౌరస్తాలో నలువైపుల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు వచ్చి ఒక్కసారిగా రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ధర్నా చేస్తున్న నాయకులను బలవంతంగా వాహనాల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు, బీఆర్ఎస్‌నాయకులకు పెద్దఎత్తున తోపులాట చోటుచేసుకుంది.


బీఆర్ఎస్ నాయకులను తొలగిస్తున్న పోలీసులు

కరీంనగర్‌లో మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మొల్ల రామాయణం రాసిన 16వ శతాబ్దానికి చెందిన ఆతుకూరి మొల్ల విగ్రహాన్ని కరీంనగర్ కూడలిలో ఏర్పాటుకు అనుమతించాలని శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్ష కార్యద ర్శులు నార్లపురం చంద్రమౌళి, కోరిక సత్యనారాయణలు అన్నారు. గురువారం కరీంనగర్ తెలంగాణ చౌరస్తాలో కవయిత్రి మొల్ల 585వ జయంతి వేడుకలను నిర్వహించి మాట్లాడారు. బహుజన వృత్తుల కులాల నుంచి 500 ఏళ్ల క్రితమే భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని రాయడం గర్వకారణమని అన్నారు.

మార్చురీకి పోయేది కేసీఆర్ కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మార్చురీకి పోయేది కేసీఆర్ కాదని రాబోయే రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి పోతాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు జోస్యం చెప్పారు. మానకొండూర్‌లో పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాజీసీఎం కేసీఆర్‌పై చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టుడు తప్ప రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను భేషరతుగా వెనక్కి తీసుకోవాలని లేకపోతే కరీంనగర్‌లో ఆయన ఏ సభ పెట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, శాతరాజు యాదగిరి, బోడ రాజశేఖర్ నాయకులున్నారు.


మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

నేషనల్ హ్యాండ్ రైటింగ్‌కు విద్యార్థినుల ఎంపిక

హుజూరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెట్రా హెడ్రాన్ మోడల్‌స్కూల్ విద్యార్థినులు నేషనల్ హ్యాండ్‌రైటింగ్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ముచ్చ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ హ్యాండ్ రైటింగ్‌లో 13రాష్ట్రాలు పాల్గొనగా, అందులో హుజూరాబాద్‌కు చెందిన పల్లెపు లాసిక, దీనా మోహనాజ్, కైరోజు వర్షిని పాల్గొని ప్రతిభ కనబర్చారు.


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మొల్లమాంబ జయంతి

హుజూరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో మొల్లమాంబ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు ప్రభాకర్, రవీందర్, జగన్, నరేష్, రవి, శ్రీనివాస్, బిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు ఏమైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే 995922924నంబర్‌కు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫోన్ చేయాలని కోరారు.

పరీక్ష ప్యాడ్లు, క్రీడాసామగ్రి అందజేత

రామడుగు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నతపాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం మ్యాక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడసామగ్రి, పదోతరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లను పంపిణీ చేశారు. మ్యాక్స్ డైరెక్టర్ మహేష్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు.

మానకొండూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేసినందుకు నిరసనగా మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మానకొండూర్‌లో గురువారం రాత్రి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి సీఎం దిష్టబొమ్మను దహనం చేసి రాష్ట్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీశ్వర్‌ను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. జగదీశ్వర్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిట్టల మధు, నెల్లి మురళీ, బోడ రాజశేఖర్, ఆర్. వెంకట్‌స్వామి తదితరులు ఉన్నారు.


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● న్యూస్ బాక్స్

● నేడు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పద్యకవి బాలసాని కొమురయ్య ఇంటిలో ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక సభ్యులు తెలిపారు.

● దుస్తుల పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం పురస్కరించుకొని ఐడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఈద శంకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది బండ గోపాల్‌రెడ్డి, ఎండి షైప్ ఆధ్వర్యంలో మైనార్టీ మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు.

● పరీక్ష సామగ్రి పంపిణీ

భగత్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆరెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు గురువారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హమ్‌స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్, ప్రధానోపాధ్యాయురాలు అనిత ఉన్నారు.

● కుట్టు మిషన్ పంపిణీ

సుభాష్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదకు కుట్టుమిషన్ అందచేశారు. సంస్థ సభ్యురాలు శ్రీవాణి జన్మదినం సందర్భంగా అందించినట్లు అధ్యక్షురాలు చకిలం స్వప్న తెలిపారు.

● బీఎడ్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

కరీంనగర్ అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు రంజాన్ పండుగ తర్వాత నిర్వహించాలని కాంగ్రెస్ మైనార్టీ జిల్లా చైర్మన్ ఎండీ తాజొద్దీన్ ఆధ్వర్యంలో శాతవాహన వీసీ ఉమేష్ కుమార్, ఎగ్జామినేషన్ కో-ఆర్డినటేర్‌లను కోరారు.

● మెదడువాపును సకాలంలో గుర్తించాలి

సుభాష్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మెదడువాపు వ్యాధిని సకాలంలో గుర్తించినా, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదిస్తే ప్రాణాపాయం తప్పుతుందని సోమాజిగూడ యశోద ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ మోహనకృష్ణ, క్రిటికల్‌కేర్ నిపుణుడు డాక్టర్ విశ్వక్ తెలిపారు. గురువారం నగరంలోని యశోద సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెదడువాపు వ్యాధి సోకి తీవ్రమైన ఫిట్స్‌తో కోమాలోకి వెళ్లి ప్రాణాపాయ స్థితిలో ఉన్న పెద్దపల్లి జిల్లా కాచాపూర్‌కు చెందిన రమేష్‌నుకు చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు వారు తెలిపారు.

● కిడ్నీ వ్యాధులపై అవగాహన

సుభాష్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో కిడ్నీ ముఖ్యమైనదని మెడికవర్ ఆసుపత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ తొర్రెం రాంచందర్, కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్ అన్నారు. గురువారం ప్రపంచ కిడ్నీ డేను పురస్కరించుకొని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో అవగాహన కల్పించారు. కిడ్నీ వ్యాధులను ముందస్తుగా గుర్తించకపోవడం వల్లనే అవి ప్రాణాంతకస్థాయికి చేరుతున్నాయన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

చొప్పదండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి శ్రీనివాస దీక్షితులు, నోడల్ అధికారి మోహన్, ప్రిన్సిపాల్‌సుధాకర్ పాల్గొన్నారు.

ఆదివాసీ తోటితెగ సేవాసంఘం

హుజూరాబాద్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పట్టణఆదివాసీ తోటితెగ సేవాసంఘం కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆత్రం సదానందం, ప్రధానకార్యదర్శిగా షెడమాకి క్రిష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ఆత్రం సతీష్, షెడమాకి కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా ఆత్రంశ్రీనివాస్, సోయంరమేష్, తదితరులు ఎన్నికయ్యారు.

ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు ద్రోహం

రామడుగు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌మాదిగ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్సీవర్గీకరణ అమలు చేయాలని నిరసనకుదిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టం వస్తుందని చెబుతూ మరోవైపు చట్టం రాకముందే ఉద్యోగ పరీక్ష ఫలితాలు విడుదల చేయడం మాదిగలకు ద్రోహం చేయడమే అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే ఉద్యమిస్తామన్నారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రాబోయే రోజుల్లో మంత్రి పదవి రావాలని మండలంలోని గుండ్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఇల్లంతకుంట మండలంలోని అంతగిరి పోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కొమ్మెర రవిందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముల్కల మల్లేశం పాల్గొన్నారు.

ఐసీఏఐ కార్యవర్గం ఎన్నిక

- నేడు ప్రమాణ స్వీకారం

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కరీంనగర్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, చార్టెడ్ అకౌంటెంట్ జి.ఆనంద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా సీఏ రామిడి సంతోష్, ఉపాధ్యక్షుడిగా సీఏ వనపట్ల శేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా సీఏ బెక్కంటి అజయ్‌కుమార్, కోశాధికారిగా సీఏ కరుకూరి మల్లేశం, విద్యార్థుల శాఖ అధ్యక్షుడిగా గందె శ్రీనివాస్, కమిటీ సభ్యుడిగా మార్గం శ్యాంసుందర్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం శ్వేత హోటల్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు కరీంనగర్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ది కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ గార్డెన్స్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి బ్యాంకు సభ్యులు హాజరై బ్యాంకు అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

అక్రమ అరెస్టులు సరికాదు

భగత్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. గురువారం ఉదయం పోలీసులు అరెస్టు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం, పెరిగిన ధరలకనుగుణంగా ఉపాధి కూలీలకు 600 రూపాయల కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● కొత్తపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడుకవ్వంపల్లి అజయ్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు జిందా రాజులను కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు.

'పారమిత'లో పది విద్యార్థుల వీడ్కోలు సంబరాలు

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పారమిత ఉన్నత పాఠశాలలో విగమ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సంబరాలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలను పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు అనూకర్‌రావు, వినోద్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల అధినేత ఇ.ప్రసాద్‌రావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేష్, టి.యస్వి రమణ, వి.యు.ఎం ప్రసాద్, హన్మంతరావు, హెచ్‌ఎం బాలాజీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

కరీంనగర్ ఎక్సైజ్ సీఐకి నగదు రివార్డు

కరీంనగర్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిందితులకు 20 ఏళ్ల జైలుశిక్ష పడిన కేసుకు సంబంధించి కరీంనగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె నాగేశ్వర్‌రావు విశేష కృషిని ప్రశంసిస్తూ రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి హైదరాబాద్‌లో బుధవారం క్యాష్ రివార్డు ఇచ్చారు. కరీంనగర్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో సీఐ నాగేశ్వర్‌రావును కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పులి నగేష్ గౌడ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్ అభినందించారు.

ఒలింపియాడ్‌లో 'వివేకానంద' విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వివేకానంద విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన సిల్వర్ జోన్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో ఎనిమిది బంగారు, ఐదు రజత పతకాలు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇ.స్నేహిత్ వర్మ, పి.హాసిని, పి.శాన్వి, ఎస్.శివన్మరణి, అమృత మిస్త్రీ, హర్షిత్‌కౌర్, జి.అదితి వైశాలి, ఎ.సాహస్ బంగారు పతకాలను, జి.అద్వైత్, జీ.మిలిని వైశాలి, జి.కార్తీక వైశాలి, టి.భవిష్య, నితీష్‌కుమార్ మిస్త్రీలు రజిత పథకాలు సాధించినట్లు వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సౌగాని కొమురయ్య తెలిపారు. విద్యాసంస్థల ప్రిన్సిపాల్ మిథున్ జె మిస్త్రీ, వైస్ ప్రిన్సిపాల్ సాగర్ ఉన్నారు.

పేద పూజారికి 'వేవా' ఆర్థిక సహాయం

కరీంనగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజారిగా ఉన్న కలికోట లత శ్రీధర్‌కు విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ (వేవా) ఆర్థిక సహాయం అందించింది. గురు వారం స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వేవా కార్యవర్గ సభ్యులు పూజారి లత శ్రీధర్‌కు 10,500 రూపాయల విలువ చేసే కిరాణ సామగ్రి, 11,000 రూపాయల నగదు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వేవా అధ్యక్షుడు గద్దెజగదీశ్వరాచారి, ప్రధాన కార్యదర్శి బూరు గుపల్లి రవీందర్, సభ్యులు కనపర్తి దివాకర్, కనపర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ

రామడుగు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో హోలీపండుగ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా విద్యార్థులు ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ హోలీవేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

వాహనాల తనిఖీ

హుజూరాబాద్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాహనాలను టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ గురువారం తనిఖీచేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు.

రెండో రోజు ఎమ్మార్పీఎస్ దీక్ష

హుజూరాబాద్/గంగాధర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, గంగాధరల్లో ఎస్సీవర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న దీక్షలు గురువారం రెండోరోజుకు చేరాయి.గంగాధరలో దీక్షకు మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం తెలిపారు.

గ్రూప్-2 సాధించిన అభ్యర్థికి సన్మానం

హుజూరాబాద్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్న నిఖిల్‌రెడ్డి గ్రూప్-2లో 70వ ర్యాంక్ సాధించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గురువారం సన్మానించారు. ఆయనవెంట రాజు, సంజీవ్, సారయ్య, రమేష్, సంపత్, కొండాల్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.